జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ॥ సంపుటి:1 ॥ సంచిక: 28 ॥ శనివారం ॥ 27-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



## కొత్త ప్రధాన కార్యదర్శిగా
# సంజయ్ జాజు నియామకం

**తెలంగాణ రాష్ట్ర కొత్త ప్రధాన కార్యదర్శిగా (చీఫ్ సెక్రటరీ) సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజును నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పలువురు అధికారుల పేర్లను పరిశీలించిన అనంతరం సంజయ్ జాజు పేరును ఖరారు చేసింది. 1992 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన సంజయ్ జాజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోనూ వివిధ కీలక బాధ్యతలు నిర్వహించారు.**

హైదరాబాద్, జూన్ 26 : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్‌గా, పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా సేవలందించారు. సమాచార సాంకేతిక రంగంలో ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభంగా అందుబాటులోకి తీసుకొచ్చిన 'మీ సేవ' వంటి వినూత్న సేవల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారు. తదనంతరం కేంద్ర ప్రభుత్వానికి డిప్యుటేషన్‌పై వెళ్లిన సంజయ్ జాజు, సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా, ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. పరిపాలనా రంగంలో ఆయనకు ఉన్న విశేష అనుభవం దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్ర మంత్రివర్గ నియామకాల కమిటీ ఆయనను తిరిగి తెలంగాణ కేడర్‌కు పంపేందుకు ఆమోదం తెలిపింది. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పదవీ విరమణ చేసిన వెంటనే, జూన్ 30 తర్వాత సంజయ్ జాజు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

# రాజ్యాంగం, చట్టాలే పౌరసత్వానికి ప్రామాణికం

- అసదుద్దీన్ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి కౌంటర్



- బీజేపీ సభ్యత్వ కార్డుపై ఓవైసీ ఎద్దేవా
- బాధ్యతాయుతంగా మాట్లాడాలని ఓవైసీకి హితవు
- పౌరసత్వ అంశంపై బీజేపీ-ఎంఐఎం మాటల యుద్ధం

2

*'భారత పౌరసత్వానికి పాస్‌పోర్ట్ ప్రామాణికం కాదంటే మరి బీజేపీ సభ్యత్వం ప్రామాణికమవుతుందా...? అంటూ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు.*




## సినీ పరిశ్రమ మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటంలో
# భాగస్వామ్యం కావాలి
### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం చేపట్టిన "సే నో టు డ్రగ్స్" ఉద్యమంలో తెలుగు సినీ పరిశ్రమ మొత్తం భాగస్వామ్యం కావాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల సామాజిక బాధ్యతగా సినీ ప్రముఖులంతా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా వీడియో సందేశాలు ఇవ్వాలని ఆయన కోరారు. అవసరమైతే సమాచార, సినిమాటోగ్రఫీ శాఖల అధికారులు సినీ ప్రముఖుల వద్దకు వెళ్లి వీడియోలు చిత్రీకరించి, వాటిని రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.**

- హైదరాబాద్, జూన్ 26

శుక్రవారం శిల్పకళా వేదికలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం మరియు మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హీరోలు, హీరోయిన్లు, నటులు, దర్శకులు, క్యారెక్టర్ ఆర్టిస్టులు వంటి సినీ ప్రముఖులు ఇచ్చే చిన్న వీడియో సందేశం కూడా వేలాది మంది యువత జీవితాలను సానుకూలంగా మార్చగలదని (మిగతా 2వ పేజీలో)






## ఆపరేషన్ సింధూర్‌కు ఆరుగురు
# వీరుల త్యాగం

**న్యూఢిల్లీ, జూన్ 26**

పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సాయుధ దళాలు చేపట్టిన ఆపరేషన్ సింధూర్ సందర్భంగా ఆరుగురు భారతీయ సైనికులు వీరమరణం పొందినట్లు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. ఈ ఆపరేషన్‌లో దేశం కోసం ప్రాణాలు అర్పించిన జవాన్ల పేర్లను తొలిసారిగా ప్రకటించడంతో పాటు, వారి త్యాగాన్ని శాశ్వతంగా గుర్తుంచుకునేలా జాతీయ యుద్ధ స్మారకంపై చెక్కనున్నట్లు భారత సైన్యం తెలిపింది. వీరమరణం పొందిన వారిలో సుబేదార్ మేజర్ పవన్ కుమార్, (మిగతా 2వ పేజీలో)

## హమాలీ ఆవిర్భావ సభకు
# కేటీఆర్‌కు ఆహ్వానం

**జూలై 6 సభకు ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించిన బండారి లక్ష్మారెడ్డి**

**హమాలీ కార్మికుల సమస్యలపై కేటీఆర్‌కు వివరాలు**

**హైదరాబాద్, జూన్ 26**

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జూలై 6న మల్లాపూర్‌లోని వీఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్న హమాలీ ఆవిర్భావ సభకు ముఖ్య అతిథిగా హాజరై (మిగతా 2వ పేజీలో)





## అసైన్డ్ భూముల విషయంలో పేదలకు
# అండగా ఉంటాం

- పరిగి బీఆర్ఎస్ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు
- అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని వెల్లడి

**పరిగి నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశా రు. అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు అదే భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.**

**పరిగి, జూన్ 26**

దళితులు, గిరిజనులు, పేద రైతుల భూములను పారిశ్రామికవాడల పేరుతో తీసుకుంటున్నారని విమర్శి ంచారు. పరిగి నియోజక వర్గంలో కూడా పారిశ్రామిక వాడల పేరిట పేదల భూ ములను బల వంతంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు (మిగతా 2వ పేజీలో)

## తెలంగాణలో ఎస్ఐఆర్ పర్యవేక్షణకు
# టీపీసీసీ ప్రత్యేక కమిటీ

**హైదరాబాద్, జూన్ 26**

తెలంగాణలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పర్యవేక్షించేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘంతో సమన్వయం కోసం పులిపాటి రాజేష్ కుమార్‌ను ఎన్నికల సంఘం సమన్వయ కమిటీ చైర్మన్‌గా నియమించారు. ఆదిలాబాద్, కరీంనగర్, మల్కాజిగిరి, హైదరాబాద్, చేవెళ్ల, నల్గొండ, -2వ పేజీలో

## పారిశ్రామికాభివృద్ధి అంటే పెట్టుబడులు కాదు..
# ప్రజలకు ఉపాధి: భట్టి

**తెలంగాణ ప్రభుత్వం దృష్టిలో పారిశ్రామికాభివృద్ధి అంటే కేవలం పెట్టుబడుల గణాంకాలు కాదు, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. శుక్రవారం హైటెక్స్‌లో నిర్వహించిన ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో--2026ను ప్రారంభించి ఆయన ప్రసంగించారు. - హైదరాబాద్, జూన్ 26**



# నేటి రాశి ఫలాలు

**మేషం :** ఆలోచించి తీసుకునే నిర్ణయాలు మీకు అనుకూల ఫలితాలను అందిస్తాయి. సహచరుల సహాయ సహకారంతో పనులు సాఫీగా పూర్తవుతాయి. ఆత్మవిశ్వాసం, ఉత్సాహం పెరిగి ప్రతీ కార్యక్రమంలో ముందంజ వేస్తారు. శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించడం వల్ల మరింత శుభప్రదమైన ఫలితాలు కలుగుతాయి.

**వృషభం :** ఈ రోజు గ్రహానుకూలత మీకు బాగా తోడ్పడుతుంది. సమయాన్నిసక్రమంగా వినియోగిస్తే అభివృద్ధికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయి. మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. సంతృప్తి, సుఖసంతోషాలు పెరుగుతాయి. ఇష్టదైవాన్ని ధ్యానించడం మేలు చేస్తుంది.

**మిథునం :** ధార్మిక భావనలు మీకు మానసిక బలాన్ని అందిస్తాయి. చుట్టుపక్కల వారి సహకారంతో ముఖ్యమైన పనులను సులభంగా పూర్తి చేస్తారు. కీలక నిర్ణయాల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల ప్రశాంతత, ఉల్లాసం కలుగుతాయి.

**కర్కాటకం :** పరిస్థితులు కొంత మిశ్రమంగా ఉన్నప్పటికీ మీకు ధైర్యసాహసాలతో పాటు విజయాన్ని అందిస్తాయి. చిన్న ఆటంకాలను అధిగమించి లక్ష్యాల వైపు ముందుకు సాగుతారు. మీ సంకల్పశక్తి సమస్యలకు పరిష్కారాలను చూపిస్తుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ అవసరం. పరమశివుని ఆరాధన శుభప్రదంగా ఉంటుంది.

**సింహం :** మీ కృషికి తగిన ఫలితం కనిపించే రోజు. అంకితభావంతో ప్రారంభించిన పనులు విజయవంతంగా పూర్తవుతాయి. ఆర్థిక వ్యవహారాల విషయంలో వివేకంతో వ్యవహరిస్తే ప్రయోజనం ఉంటుంది. కుటుంబ సభ్యులు, బంధువులతో మీ అనుబంధం బలపడుతుంది. హనుమంతుని స్మరణ ధైర్యాన్ని పెంచుతుంది.

**కన్య :** శ్రమయపాలనతో చేసిన ప్రయత్నాలు ఆశించిన ఫలితాలను ఇస్తాయి. ధనపరంగా అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. కుటుంబంతో గడిపే సమయం ఆనందాన్ని పెంచుతుంది. భక్తితో ఇష్టదైవాన్ని ఆరాధిస్తే శుభయోగాలు మరింత బలపడతాయి.

**తుల :** ఈ రోజు అనేక విషయాల్లో అనుకూలత కనిపిస్తుంది. తెలివితేటలతో తీసుకునే నిర్ణయాలు మీ విజయానికి దోహదపడతాయి. కొత్త అవకాశాలు మీ ముందుకు రావచ్చు. మనఃశ్శాంతి, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. దైవస్మరణ మీ సంకల్పాలకు విజయాన్ని చేకూరుస్తుంది.

**వృశ్చికం :** ఉత్సాహంతో ప్రారంభించిన కార్యక్రమాలు సత్ఫలితాలను అందిస్తాయి. మీ ప్రతిభకు గౌరవం, గుర్తింపు లభించే అవకాశం ఉంది. ఆర్థిక పరిస్థితులు కూడా మెరుగుపడతాయి. మీ శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. శ్రీసుబ్రహ్మణ్యస్వామిని ప్రార్థించడం శుభదాయకం.

**ధనుస్సు :** ఆత్మవిశ్వాసంతో ప్రారంభించిన పనులను విజయవంతంగా పూర్తి చేస్తారు. కుటుంబంలో సంతోషకరమైన వాతావరణం నెలకొంటుంది. ఉద్యోగ, వృత్తి విషయాల్లో సమన్వయంతో వ్యవహరిస్తే మంచి ఫలితాలు పొందుతారు. దుర్గాదేవి ఆరాధన శక్తిని, రక్షణను ప్రసాదిస్తుంది.

**మకరం :** స్వల్ప ఆటంకాలు ఎదురైనప్పటికీ మీరు వాటిని చాకచక్యంతో అధిగమిస్తారు. ఖర్చుల విషయంలో మితంగా వ్యవహరించడం మంచిది. పట్టుదలతో ముందుకు సాగితే విజయం మీ సొంతం అవుతుంది. కనకధార స్తోత్రం పఠించడం వల్ల ఐశ్వర్యం వృద్ధి చెందుతుంది.

**కుంభం :** గ్రహస్థితి కొంత మిశ్రమంగా ఉన్నప్పటికీ మీ క్రమశిక్షణ, శ్రద్ధ విజయానికి దోహదపడతాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించడం మంచిది. అనవసర విభేదాలకు దూరంగా ఉంటే మానసిక ప్రశాంతత లభిస్తుంది. శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనం శుభఫలితాలను కలిగిస్తుంది.

**మీనం :** మీ కృషికి తగిన ప్రతిఫలం లభించే అవకాశం ఉంది. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో పురోగతి సాధిస్తారు. ఆర్థికంగా అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. స్థిరచిత్తంతో తీసుకునే నిర్ణయాలు మంచి ఫలితాలను అందిస్తాయి. శ్రీమహాలక్ష్మీదేవిని ఆరాధించడం శ్రేయస్సును కలిగిస్తుంది.



# ఆపరేషన్ సింధూర్‌కు ఆరుగురు వీరుల త్యాగం

(మొదటి పేజీ తరువాయి)

రైఫిల్‌మాన్ సునిల్ కుమార్, లాన్స్ నాయక్ దినేశ్ కుమార్, అగ్నీవీర్ మురళీ నాయక్, హవిల్దార్ సునిల్ కుమార్ సింగ్‌తో పాటు భారత వైమానిక దళానికి చెందిన సురేంద్ర కుమార్ ఉన్నారు. దేశ భద్రత కోసం నిర్వహించిన సైనిక చర్యల్లో వీరు అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శిస్తూ అమరులయ్యారని అధికారులు పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో ప్రాణత్యాగం చేసిన ఈ ఆరుగురు జవాన్లతో పాటు 2025లో వివిధ సైనిక కార్యకలాపాల్లో అమరులైన మరికొందరు సైనికుల పేర్లను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. నేషనల్ వార్ మెమోరియల్‌లోని త్యాగ చక్ర వద్ద వీరి పేర్లను శాశ్వతంగా పొందుపరచడం ద్వారా దేశం వారి సేవలను చిరస్మరణీయంగా నిలుపుకోనుంది. గత ఏడాది మే 7న పాకిస్థాన్‌తో పాటు పాక్




ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సాయుధ దళాలు లక్షిత దాడులు నిర్వహించాయి. పహల్గామ్ ఉగ్రదాడికి బాధ్యులైన ఉగ్రవాద మౌలిక వసతులను ధ్వంసం చేయడమే ఈ ఆపరేషన్ ప్రధాన లక్ష్యంగా చేపట్టబడింది. ఈ చర్యతో ఉగ్రవాదంపై భారత వైఖరి మరోసారి స్పష్టమైంది. భారత దాడులకు ప్రతిస్పందనగా పాకిస్థాన్ డ్రోన్ దాడులు, సరిహద్దు కాల్పులు, వైమానిక దాడులకు పాల్పడటంతో రెండు దేశాల మధ్య నాలుగు రోజుల పాటు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భారత సాయుధ దళాలు సమర్థంగా ప్రతిఘటించి శత్రు ప్రయత్నాలను విఫలం చేశాయి. అనంతరం మే 10న ఇరు దేశాల మధ్య యుద్ధ విరమణ అమల్లోకి రావడంతో పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్నాయి. ఆపరేషన్ సింధూర్‌లో అమరులైన వీర జవాన్ల త్యాగం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రాణాలను అర్పించిన ఈ సైనికుల సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, వారి కుటుంబాలకు దేశం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేసింది.

## సినీ పరిశ్రమ మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటంలో భాగస్వామ్యం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

భట్టి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలో ఒక్క యువకుడు కూడా మాదకద్రవ్యాలకు బానిస కాకుండా చూడాలని దృఢ సంకల్పంతో పనిచేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా డ్రగ్స్ విక్రయం, సరఫరాకు అవకాశం ఉండబోదని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఈగిల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసి, తగిన నిధులు, వాహనాలు అందించిందని తెలిపారు. సమాజ రక్షణ కోసం పనిచేస్తున్న పోలీసు సిబ్బందికి ప్రత్యేక ప్రోత్సాహకాలు కూడా మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, చిన్నారుల భవిష్యత్తును ప్రమాదంలో పడేసే వారెవరైనా ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేవలం చట్టాలు చేయడం వల్లే సమాజంలో మార్పు రాదని, ప్రజల సహకారం కూడా అవసరమని భట్టి విక్రమార్క అన్నారు. వరకట్న నిషేధ చట్టాన్ని ఉదాహరణగా ప్రస్తావిస్తూ, చట్టాలకు సమాజం మద్దతు లభించినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో కౌన్సెలింగ్‌తో పాటు సమాజంపై ప్రభావం చూపే సినీ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు సోషల్ మీడియా, వీడియో సందేశాల ద్వారా డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు.

## ..టీపీసీసీ ప్రత్యేక కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

వరంగల్, ఖమ్మం తదితర పార్లమెంట్ నియోజకవర్గాలకు ఈ నియామకాలు చేపట్టింది. ఈ సందర్భంగా పులిపాటి రాజేష్ కుమార్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు కమిటీ సభ్యులు బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), అసెంబ్లీ, పార్లమెంట్ స్థాయి కాంగ్రెస్ నాయకులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తారని తెలిపారు. ఓటరు జాబితా సవరణలో తలెత్తే ఏవైనా సమస్యలను వెంటనే ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ సజావుగా సాగడంతో పాటు ఓటర్లకు సంబంధించిన సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడమే ఈ కమిటీ ఏర్పాటు ప్రధాన ఉద్దేశమని టీపీసీసీ వెల్లడించింది.

## రాజ్యాంగం, చట్టాలే పౌరసత్వానికి ప్రామాణికం

హైదరాబాద్,

పాస్ పోర్ట్ ఒక్కటే పౌరసత్వానికి ప్రామాణికం కాదన్నారు. పౌరసత్వంపై అసదుద్దీన్ ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారని వ్యాఖ్యానించారు. బారిస్టర్ అయ్యి చట్టవిరుద్ధంగా మాట్లాడటం విచారకరం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌరసత్వాన్ని నిర్ణయించేది రాజ్యాంగం, చట్టమేనని స్పష్టం చేశారు. భారతీయులు కాని వారికి కూడా పాస్ పోర్ట్ ఇవ్వవచ్చని చెప్పారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవాళ్లు బాధ్యతాయుతంగా మాట్లాడాలని హితవుపలికారు. ప్రజలను తప్పుదోవ పట్టించేముందు చట్టాలని చదవాలని అన్నారు. అయితే ఇటీవల అసదుద్దీన్ ఓవైసీ పాస్ పోర్ట్ పై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. జనన ధ్రువీకరణ, ఓటర్ ఐడీ కార్డు, ఆధార్ కార్డు కూడా ప్రామాణికం కాకపోతే ఏ పత్రం పౌరసత్వానికి ప్రామాణికం అవుతుందో చెప్పాలని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం రేపు బీజేపీ సభ్యత్వ కార్డు ఉంటేనే పౌరసత్వం ఉన్నట్టు అని ప్రకటించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరంలేదని ఎద్దేవా చేశారు.

## ..పేదలకు అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల అంగీకారం లేకుండా భూములు తీసుకోవడం సరికాదని, ప్రభుత్వం నిజంగా చిత్తశుద్ధితో వ్యవహరిస్తే ముందుగా పట్టాలు ఇచ్చి, చట్టబద్ధమైన నష్టపరిహారం చెల్లించిన తర్వాతే భూసేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లగచర్ల ఘటనను ప్రస్తావిస్తూ భూములు ఇవ్వలేదనే కారణంతో రైతులపై కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. గిరిజనులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించడం దురదృష్టకరమని, ఇలాంటి చర్యలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. అసైన్డ్ భూముల విషయంలో పేదలకు పార్టీ అండగా నిలుస్తుందని, అవసరమైతే న్యాయపోరాటం కూడా చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. రైతులకు రైతుబంధు, పంట బోనస్, కౌలు రైతులు, రైతు కూలీలకు ఆర్థిక భరోసా, మహిళలకు నెలకు రూ.2,500 వంటి హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఇచ్చిన హామీలు కూడా అమలు కాలేదని అన్నారు. పరిగి ప్రాంతానికి నీటి ప్రాజెక్టుల విషయంలో కూడా ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. గతంలో రూపొందించిన ప్రణాళికలను పక్కనపెట్టి కొత్త పథకాల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు. మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, లేకపోతే ప్రజలకు సమాధానం చెప్పాల్సి వస్తుందని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తే పార్టీ అండగా ఉంటుందని, చట్టపరంగా పోరాడుతామని హెచ్చరించారు. అలాగే భవిష్యత్తులో కార్యకర్తలకు తగిన గౌరవం, అవకాశాలు కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## హమాలీ ఆవిర్భావ సభకు కేటీఆర్‌కు ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా హమాలీ కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, హమాలీ సంఘం చేపడుతున్న కార్యక్రమాలపై కేటీఆర్‌కు బండారి లక్ష్మారెడ్డి వివరించారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని కూడా ప్రస్తావించినట్లు సమాచారం. హమాలీ కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల విస్తరణపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. జూలై 6న జరిగే ఆవిర్భావ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి హమాలీ కార్మికులు, సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నట్లు వెల్లడించారు. ఈ భేటీలో మాజీ ఎమ్మెల్యే దేవేందర్ రెడ్డితో పాటు హమాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హమాలీ శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు. సభ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై కూడా ఈ సందర్భంగా చర్చించినట్లు సమాచారం. అనంతరం హబ్సిగూడ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీవీ చారి జన్మదినం సందర్భంగా కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు, విజయాలు కలగాలని ఆకాంక్షించారు. జూలై 6న నిర్వహించనున్న హమాలీ ఆవిర్భావ సభకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయని, కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే వేదికగా ఈ సభ నిలవనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పారిశ్రామికాభివృద్ధి అంటే పెట్టుబడులు

హైదరాబాద్, జూన్ 26 (రథసారథి)

ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరిశ్రమలు–ప్రభుత్వం మధ్య వారధిగా తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ ఎక్స్‌పో కేవలం యంత్రాలు, ఉత్పత్తుల ప్రదర్శన మాత్రమే కాదని, కొత్త ఆలోచనల మార్పిడికి, సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడానికి, చిన్న పరిశ్రమలు కొత్త వినియోగదారులను సంపాదించడానికి, స్టార్టప్‌లు తమ తొలి కొనుగోలుదారులను చేరుకోవడానికి ఇది ఉత్తమ వేదికగా నిలుస్తుందని వివరించారు. రాష్ట్ర ఏర్పాటైనప్పటి నుంచి తెలంగాణ పారిశ్రామిక రంగంలో పెట్టుబడిదారుల విశ్వాసాన్ని సంపాదించి వేగవంతమైన అభివృద్ధిని సాధించిందన్నారు. హైదరాబాద్ ఐటీ, ఔషధ, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని పేర్కొంటూ, రాష్ట్ర అభివృద్ధి సేవారంగానికే పరిమితం కాకుండా తయారీ రంగంలోనూ మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీడీపీ)లో పరిశ్రమల, ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈలు) వాటాను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. తయారీ రంగం ఉపాధి కల్పనతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రయోజనాలు కేవలం పెద్ద కంపెనీలకే కాకుండా చిన్న పరిశ్రమలు, మహిళా పారిశ్రామికవేత్తలు, గ్రామీణ పారిశ్రామికవేత్తలకు కూడా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందుకోసం ప్రతి శుక్రవారం ఎంఎస్ఎంఈ సంఘాలు, పారిశ్రామికవేత్తల ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలు, సూచనలు తెలుసుకుంటానని అధికారికంగా ప్రకటించారు. ఎలక్ట్రిక్ మొబిలిటీ, పునరుత్పాదక ఇంధనం, రోబోటిక్స్, కృత్రిమ మేధ (ఏఐ), స్మార్ట్ మ్యాన్యుఫ్యాక్చరింగ్




వంటి భవిష్యత్ సాంకేతికతలకు ఎక్స్‌పోలో ప్రాధాన్యం ఇవ్వడాన్ని భట్టి అభినందించారు. అలాగే మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీని స్మరించుకుంటూ, దేశంలో కంప్యూటర్ విప్లవానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. రాష్ట్రంలో అన్ని రకాల ఎలక్ట్రిక్ వాహనాలకు రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజులపై 100 శాతం మినహాయింపు కల్పించామని తెలిపారు. కేవలం ఈవీ వినియోగాన్ని ప్రోత్సహించడం మాత్రమే కాకుండా, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, సరఫరా వ్యవస్థ, అనుబంధ సాంకేతిక పరిశ్రమలను తెలంగాణలో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గత రెండున్నరేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 15 వేల మెగావాట్ల నుంచి 18,500 మెగావాట్లకు పెరిగినప్పటికీ, ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని భట్టి వెల్లడించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఆయన, ప్రభుత్వ పెట్టుబడులతో పాటు పబ్లిక్--ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలోనూ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామికవేత్తలకు ఆయన పిలుపునిచ్చారు.

జ్యోతి శ్వేత

## సంపాదకీయం

27-06-2026

# ఎల్‌నినో కార్యాచరణ ఏదీ?

ఎల్‌నినో హెచ్చరికల నేపథ్యంలో పాలకులు అప్రమత్తం కావాల్సి ఉంది. ముఖ్యంగా సాగు, తాగునీరుతో పాటు, వ్యవసాయ విధానంపై ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం కావాల్సి ఉండగా అలాంటిదేమీ కనిపించడం లేదు. ఇప్పుడు దీని ప్రభావంతో భారతదేశానికి కరువు కాలం కమ్ముకొస్తుంది. దీనిపై ప్రజలను రైతులను అప్రమత్తం చేయడంతో పాటు, కార్యాచరణకు సిద్ధం కావాల్సి ఉంది. నైరుతి రుతు పవనాల రాకతో వర్షాలు పడతాయి.. వ్యవసాయం బాగుంటుందని ఆశిస్తున్న రైతులకు ఇది అశనిపాతం లాంటిదే. ఎల్ నినో వచ్చేసిందని.. ఈ రుతు పవనాల సమయంలో అది మరింత బలపడుతుందని భాతర వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇదే సమయంలో ఎల్ నినో ప్రారంభం అయినట్లు జపాన్ వాతావరణ సంస్థ జూన్ 11వ తేదీన అధికారికంగా ప్రకటించటం విశేషం. పసిఫిక్ సముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగటాన్ని ఎల్ నినో అంటారు. సముద్ర ఉపరితల జలాల ఉష్ణోగ్రత సహజంగా 3.4 డిగ్రీలుగా ఉ ంటుంది. ఇప్పుడు అది పాయింట్ 5 శాతం పెరిగింది. అంటే సముద్రం నీరు ఉండాల్సిన వేడి కంటే అధిక వేడిగా ఉన్నాయి. దీన్ని ఎల్‌నినో అంటారు. జూన్ నుంచి ఆగస్ట్ మధ్య కాలంలో ఎల్‌నినో మరింత బలపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. జూలై మధ్య నుంచి తూర్పు పసిఫిక్ అంతటా విస్తరిస్తుందని.. ఇదంతా రుతు పవనాల కాలంలోనే జరుగుతుందని వాతావరణ శాఖ నివేదిక స్పష్టం చేస్తుంది. సహజంగా నైరుతి రుతు పవనాల సీజన్ లో చల్లటి వాతావరణంతోపాటు నికరంగా వర్షాలు పడతాయి. ఎల్‌నినో ప్రభావంతో సముద్రం నీరు వేడెక్కటం వల్ల సముద్రం నుంచి భూమిపైకి వేడి గాలులు వీస్తాయి. భూమిపై ఎక్కువగా పొడి వాతావరణం ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వర్షపాతం తక్కువగా ఉంటుంది. దీంతో కరువు వస్తుంది. దీనికితోడు అక్కడక్కడ కుండపోత వర్షాలు ఉంటాయి. క్లౌడ్ బరస్టులు ఉంటాయి. దీని వల్ల విపత్తులు వచ్చే ప్రమాదం ఉంది. వర్షాలు తక్కువగా ఉండటం వల్ల నీళ్ల కొరత ఏర్పడుతుంది. మంచి నీళ్లకు.. సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయి. వ్యవసాయానికి అవసరం అయిన నీళ్లు లేక పంటలు పండవు. ఆదాయం లేక రైతులు, రైతు కూలీలకు ఇబ్బంది వస్తుంది. ఎల్‌నినో అధికారంగా ప్రారంభం అయిన భారత వాతావరణ శాఖ ప్రకటనతో ప్రభుత్వాలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. రైతులు పంటలు సాగు చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్నింటికి మించి పంటలకు సంబంధించి ఆరుతడి పంటలకు రైతులను ప్రోత్సాహించాలి. సాగునీటి లభ్యత తక్కువగా ఉంటుంది కాబట్టి, వరి లాంటి పంటలకు రైతులు దూరంగా ఉండాలి. మనకున్న వనరులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కార్యాచరణ సిద్ధం చేయాలి. ఎల్‌నినోకు కారణం ఓ రకంగా చెప్పాలంటే పర్యావరణ విధ్వంసమే. మన చేజేతులా పర్యావరణ విధ్వంసానికి పాల్పడిన పాపానికి విపరీత వాతావరణ పరిస్థితులు ఎదుర్కోబోతున్నాం. వాతావరణ మార్పు, పర్యావరణ వ్యవస్థ నష్టం, భూమి ఎడారీకరణ వంటి తీవ్రమైన పరిణామాలతో మానవ-ప్రేరిత పర్యావరణ నష్టం పెరుగుతుంది. పర్యావరణాన్ని పరిరక్షించడం, భూమి మరియు ప్రకృతిని వాటి సహజ స్థితికి పునరుద్ధరించడం ఇప్పుడు అంరి తక్షణ కర్తవ్యం కావాలి. భూమిని రక్షించడానికి, పునరుద్ధరించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. పర్యావరణ విధ్వంసం నిరంతరంగా సాగడంవ వల్ల మన భూమి భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఎడారీకరణ, భూమి క్షీణత, కరువు అనేది మన కాలంలోని అత్యంత ముఖ్యమైన పర్యావరణ సవాళ్లలో ఒకటి. ఇటీవలే జూన్ 5న

ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నాం. అయినా మనలో మార్పు కానరావడం లేదు. చెరువులను మింగేస్తున్నాం. ప్లాస్టిక్ భూతాన్ని భూమిపైకి వదిలేస్తున్నాం. మన పర్యావరణాన్ని రక్షించడానికి

ప్రపంచవ్యాప్త అవగాహన, కార్యాచరణను ప్రోత్సహించడానికి మాటలతో సరిపెడుతున్నాం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పర్యావరణంపై దృష్టి సారించి, ఏటా చర్యలు తీసుకుని ఉంటే ఇలాంటి ఎల్‌నినో ప్రభఆవాలు వచ్చే వచ్చేవి కావు. ఇప్పటికైనా మనమంతా భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తి, పద్ధతులపై దృష్టి సారించాలి. మన భవిష్యత్తు, మన తరం, భూమి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు ఆ వైపు కార్యాచరణను రూపొందించి కచ్చితంగా అమలు చేయాలి. పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు, సైన్సు సంస్థలు ఎల్‌నినో దుష్ఫలితాలపై విస్తృతంగా ప్రచారంనిర్వహించాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. ముఖ్యంగా యువతను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలి. ద ఈ నిని ప్రజా ఉద్యమంగా దిశా నిర్దేశం చేయాలి. అన్ని పర్యావరణ పరిరక్షణ సంస్థలు, వ్యక్తులు ఒక ఉద్యమంలా ఐక్యంగా పనిచేయడం ద్వారా ధరిత్రిని కాపాడుకోవాలి. ఈ క్రమంలో తక్షణంగా ప్రస్తుత విపత్తును తట్టుకునే కార్యాచరణకు రంగం సిద్ధం చేయాలి. కేంద్రం తక్షణమే రాష్ట్రాలతో సంప్రతింపులు జరిపి వ్యవసాయ స ంక్షోభ నివారణకు చర్యలు తీసుకోవాలి. తాగునీటి సమస్యపైనా చర్చించాలి.

# ఎన్నికల టూర్ కాదు.. ప్రజా టూర్!

**రాష్ట్రానికి బీజేపీ**
**జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్**
**28, 29, 30న తెలంగాణలో**
**పర్యటన, పార్టీ పటిష్టంపై ఫోకస్**
**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు**
**రామచంద్రరావు వెల్లడి**



హైదరాబాద్, జూన్ 26: తెలంగాణలో కమల వికాసమే లక్ష్యంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఈ నెల 28, 29, 30 తేదీల్లో చేపడుతున్న తెలంగాణ పర్యటన కేవలం ఎన్నికల కోసం కాదని, ప్రజలకు మరింత చేరువయ్యేందుకు చేస్తున్న ప్రజా టూర్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు స్పష్టం చేశారు. శుక్రవారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. పర్యటన వివరాలను వెల్లడించారు. ఆదివారం రాష్ట్రానికి వస్తున్న ఆయన రంగారెడ్డి జిల్లా కార్యాలయం నుంచి వర్చువల్‌గా పది కార్యాలయాలను ప్రారంభిస్తారని, అనంతరం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బూత్ అధ్యక్షులతో, రాష్ట్ర కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో సమావేశమవుతారని తెలిపారు. వీబీఐటీ విద్యార్థులతో కాంక్లేవ్ ముగిశాక, వరంగల్ పర్యటనకు వెళ్లి కోయ, లంబాడ, చెంచు తదితర గిరిజన వర్గాలతో, ఉమ్మడి వరంగల్ కార్యకర్తలతో భేటీ అవుతారని, మరుసటి రోజు ఘట్‌కేసర్‌లో రాష్ట్ర కమిటీ సమావేశంలో పాల్గొని శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని వివరించారు.

రాష్ట్ర జల హక్కుల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణ ప్రజలను దారుణంగా మోసం చేశాయని రామచంద్రరావు మండిపడ్డారు. తుంగభద్ర గేట్ల మరమ్మతుల గురించి మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి.. మనకు రావాల్సిన 15.9 టీఎంసీల వాటా సాధనపై ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. కర్ణాటక ప్రతిపాదిస్తున్న 35 టీఎంసీల నవేలి రిజర్వాయర్, ఏపీ నిర్మించాలనుకుంటున్న 20 టీఎంసీల గుండ్రేవుల ప్రాజెక్టుల వల్ల మనకు 5 టీఎంసీలు కూడా దక్కే పరిస్థితి లేదన్నారు. నాడు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌లో కేసీఆర్ తక్కువ వాటాకు ఒప్పుకుని రాష్ట్రానికి ద్రోహం చేశారని విమర్శించారు. ఆర్డీఎస్ సమస్యపై కేంద్రం కేవలం మధ్యవర్తిత్వం మాత్రమే చేస్తుందని, కానీ ఇటీవలి ఢిల్లీ పర్యటనలో కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌తో జల వివాదాలపై ఏం మాట్లాడారో సీఎం రేవంత్ రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ఓటర్ల జాబితా సవరణ, పౌరసత్వం విషయంలో మజ్లిస్, కాంగ్రెస్ పార్టీలు కావాలనే ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నాయని రామచంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాస్‌పోర్ట్ అనేది కేవలం ప్రయాణ పత్రం మాత్రమేనని, అది పౌరసత్వ ధ్రువీకరణ కాదన్న విషయాన్ని 1967 పాస్‌పోర్ట్ చట్టం, 2013 బాంబే హైకోర్టు తీర్పులే స్పష్టం చేశాయన్నారు. అందుకు దలైలామా ఉదంతమే నిదర్శనమన్నారు. చట్టాలపై పూర్తి అవగాహన ఉన్న ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ లాంటి నేతలు కూడా అబద్ధాలు ప్రచారం చేయడం తగదని హితవు పలికారు. కాంగ్రెస్ హయాంలో ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగినప్పుడు మౌనంగా ఉన్న ఈ పార్టీలు.. ఇప్పుడు బీజేపీ సిటిజన్‌షిప్ రద్దు చేస్తుందంటూ తప్పుదోవ పట్టించడం మానుకోవాలని, ప్రజలంతా వాస్తవ వివరాలు అందించి సహకరించాలని ఆయన కోరారు.



# విద్యావ్యవస్థలో మార్పు మీరే తేవాలి

**ఉపాధ్యాయులకు మంత్రి లోకేశ్ దిశానిర్దేశం**

అమరావతి, జూన్ 26: రాష్ట్ర విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడానికి ఉపాధ్యాయులే నాయకత్వం వహించాలని, అందరూ కలిసికట్టుగా కృషి చేసి 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్'ను సాధించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఇటీవల సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లివచ్చిన 37 మంది ఉత్తమ ఉపాధ్యాయులతో ఆయన ఉండవల్లిలోని తన నివాసంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా, సింగపూర్ పర్యటనలో తాము తెలుసుకున్న అధునాతన విద్యా విధానాలు, అంతర్జాతీయ బోధనా పద్ధతులను ఉపాధ్యాయులు మంత్రికి వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వాటిని ప్రాథమిక స్థాయి నుండి అమలు చేయడానికి ఉన్న అవకాశాలపై తమ క్షేత్రస్థాయి అభిప్రాయాలను పంచుకోగా.. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను లోకేశ్ ఆసక్తిగా నోట్ చేసుకున్నారు.

అనంతరం ఉపాధ్యాయులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ.. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంలో ఉపాధ్యాయుల పాత్రే అత్యంత కీలకమని స్పష్టం చేశారు. కష్టపడి పనిచేసి, విద్యార్థుల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రోత్సహించే ఉపాధ్యాయులకు ప్రభుత్వం తరపున తప్పకుండా తగిన గుర్తింపు, ప్రోత్సాహకాలు ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర విద్యారంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈ ప్రయాణంలో ఉ పాధ్యాయ లోకమంతా భాగస్వాములు కావాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు.

# కెనడా పీఆర్

## Permanent Residency

## అవకాశాలు, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ

విదేశాల్లో స్థిరపడాలని కోరుకునే భారతీయులలో కెనడా ప్రముఖ గమ్యస్థానంగా కొనసాగుతోంది. మెరుగైన జీవన ప్రమాణాలు, నాణ్యమైన విద్య, ప్రభుత్వ ఆరోగ్య సేవలు, ఉపాధి అవకాశాలు వంటి అంశాలు కెనడాను ఆకర్షణీయ దేశంగా నిలబెడుతున్నాయి. అయితే కెనడా పర్మినెంట్ రెసిడెన్సీ (PR) పొందాలంటే అభ్యర్థులు నిర్దిష్ట అర్హతలు, పాయింట్ల విధానం మరియు అధికారిక ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది.

**పీఆర్ అంటే ఏమిటి?**

పర్మినెంట్ రెసిడెన్సీ (PR) అనేది కెనడాలో శాశ్వత నివాస హోదా. పీఆర్ పొందిన వ్యక్తులు కెనడాలో నివసించడం, ఉద్యోగం చేయడం, చదువుకోవడం వంటి హక్కులు పొందుతారు. అనంతరం అర్హత సాధించిన తర్వాత కెనడా పౌరసత్వానికి కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది.

**ప్రధాన ఇమ్మిగ్రేషన్ మార్గాలు**

ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ (Express Entry)
ప్రొవిన్షియల్ నామినీ ప్రోగ్రామ్ (పీఎన్‌పీ)
ఫ్యామిలీ స్పాన్సర్‌షిప్
అట్లాంటిక్ ఇమ్మిగ్రేషన్ ప్రోగ్రామ్
రూరల్ మరియు కమ్యూనిటీ ఆధారిత ఇమ్మిగ్రేషన్ పథకాలు

**ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ ఎలా పనిచేస్తుంది?**

ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ కెనడాలో అత్యంత ప్రాచుర్యం పొందిన ఆన్‌లైన్ ఇమ్మిగ్రేషన్ విధానం. ఇందులో వయస్సు, విద్యార్హత, ఉద్యోగ అనుభవం, ఇంగ్లిష్ లేదా ఫ్రెంచ్ భాషా నైపుణ్యం వంటి అంశాల ఆధారంగా జ=ూ పాయింట్లు కేటాయిస్తారు. అధిక పాయింట్లు సాధించిన అభ్యర్థులకు దరఖాస్తు చేసుకునేందుకు ఆహ్వానం (ITA) వచ్చే అవకాశం ఉంటుంది.

**అవసరమైన అర్హతలు**

గుర్తింపు పొందిన విద్యార్హత
సంబంధిత ఉద్యోగ అనుభవం
IELTS లేదా CELPIP భాషా పరీక్షల్లో అర్హత మార్కులు
అవసరమైతే ECA (Educational Credential Assessment)
మెడికల్ మరియు పోలీస్ క్లియరెన్స్
పీఆర్ వల్ల కలిగే ప్రయోజనాలు
కెనడాలో ఎక్కడైనా నివసించే అవకాశం
పూర్తి సమయ ఉద్యోగ అవకాశాలు
ప్రభుత్వ ఆరోగ్య సేవలు
పిల్లలకు ప్రభుత్వ విద్యా సదుపాయాలు
భవిష్యత్తులో కెనడా పౌరసత్వానికి అవకాశం



గమనిక: ఇమ్మిగ్రేషన్ నిబంధనలు, పాయింట్ల పరిమితులు, ఎంపిక ప్రమాణాలు కాలానుగుణంగా మారవచ్చు. కాబట్టి అభ్యర్థులు అధికారిక ప్రభుత్వ మార్గదర్శకాలను పరిశీలించి మాత్రమే దరఖాస్తు చేయాలి.

EXXEELLA Immigration Group
మీ కెనడా PR ప్రయాణంలో విశ్వసనీయ భాగస్వామి!



# పిడుగుపాటుకు యువకుడు మృతి

## సదాశివపేట మండలం వెంకటాపూర్‌లో విషాదం

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 26**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. పిడుగుపాటుకు గురై ఓ యువకుడు మృతిచెందాడు. మృతుడు వెంకటాపూర్ గ్రామానికి చెందిన చింత కుంట అనిల్ గా గుర్తించారు. వర్షం కురుస్తున్న సమయంలో పిడుగు పడ టంతో ఆయన తీవ్రంగా గాయపడి అక్క డికక్కడే మృతిచెందినట్లు స్థానికులు తెలి పారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని అనిల్ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. వారి రోదనలు అక్కడున్న వారిని కలచివేశాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు శ్రీకారం

**కరీంనగర్, జూన్ 26**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం అధికారికంగా ప్రారంభమైంది. ఈ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, క్రమబద్ధంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. పట్టణ తహసీల్దార్ కార్యాలయంలో పట్టణ, గ్రామీణ, కొత్తపల్లి మండల రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి సవరణ ప్రక్రియ అమలు, దరఖాస్తుల పంపిణీ, నమోదు విధానాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ పలు ప్రాంతాల్లో జరుగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. మండల రెవెన్యూ అధికారులు, బూత్ స్థాయి అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రతి ఇంటిని సందర్శించి ప్రతి కుటుంబానికి రెండు ఓటరు సవరణ దరఖాస్తులను అందజేయాలని, వాటిని ఎలా నింపాలి, ఎక్కడ సమర్పించాలనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. ప్రతి బూత్ పరిధిలో దరఖాస్తుల పంపిణీ వివరాలను రోజువారీగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమం నిర్వహణకు అవసరమైన దరఖాస్తులు, ఇతర సామగ్రితో కూడిన ప్రత్యేక కిట్లను బూత్ స్థాయి అధికారులకు అందజేశారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# డ్రగ్స్ రహిత తెలంగాణకు యువత భాగస్వాములు కావాలి

**రాజన్న సిరిసిల్ల, జూన్ 26**

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ కూడలి నుంచి పద్మనాయక ఫంక్షన్ హాల్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు, పోలీసులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ రహిత తెలంగాణకు మద్దతుగా నినాదాలు చేశారు. ర్యాలీలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మాదకద్రవ్యాల వల్ల వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజం తీవ్రంగా నష్టపోతాయని పేర్కొంటూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. చదువు, క్రీడలు, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించి తమ జీవిత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం డ్రగ్స్ వ్యతిరేక ప్రదర్శనలు, ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొని మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన డ్రగ్స్ వ్యతిరేక అవగాహన స్టాల్స్‌ను సందర్శించిన అధికారులు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విద్యార్థులకు వివరించారు.

# మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా అరుణ కుమారి

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ జూన్ 26**



తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆమోదంతో మర్రి అరుణ కుమారిని ఆందోల్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమిస్తూ పార్టీ అధిష్ఠానం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పార్టీ నాయకత్వం స్పందిస్తూ, ఆందోల్ నియోజకవర్గంలో మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు మహిళలను సంఘటితం చేసి పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా తీసుకెళ్లడంలో మర్రి అరుణ కుమారి సమర్థవంతంగా పనిచేస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. నియామకంపై స్పందించిన మర్రి అరుణ కుమారి తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆందోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు అందరికీ ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మహిళా కాంగ్రెస్ సంస్థను గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా మహిళల సమస్యల పరిష్కారం, వారి సాధికారత, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తానని మర్రి అరుణ కుమారి స్పష్టం చేశారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం శ్రమిస్తానని ఆమె పేర్కొన్నారు.

# మొహర్రం పీర్ల ఊరేగింపులో టి జగ్గారెడ్డి, నిర్మల

## ప్రజలకు షర్బత్ పంపిణీ చేసిన నిర్మలా జగ్గారెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 26**





సంగారెడ్డి పట్టణంలో మొహర్రం పండుగ వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో, మత సామరస్య వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాత బస్టాండ్ సమీపంలోని దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పీర్ల ఊరేగింపులో పాల్గొని భక్తులను పలకరించారు. మొహర్రం వేడుకలను తిలకించేందుకు పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కూన సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హాఫీజ్ తదితరులు ప్రజలకు షర్బత్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనడం ఆనందదాయకమన్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మొహర్రం వేడుకలు ప్రశాంతంగా, వైభవంగా జరగడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కూన సంతోష్, సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హాఫీజ్, మైనార్టీ నాయకులు తాహెర్, కుతుబుద్దీన్, నదీం, కౌసర్, ఇమ్రాన్, ఆమేర్ జాన్, హకీమ్, ఖమర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టు మరమ్మత్తుల్లో నిర్లక్ష్యం.. రైతులకు తీవ్ర నష్టం: సీపీఎం

## కాంట్రాక్టర్, ఇరిగేషన్ అధికారుల వైఖరిపై అతిమేల మాణిక్ ఆగ్రహం

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 26**



సింగూర్ ప్రాజెక్టులో చేపట్టిన మరమ్మత్తు పనులు నిర్లక్ష్యంగా సాగుతున్నాయని, కాంట్రాక్టర్‌తో పాటు ఇరిగేషన్ శాఖ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్ ఆరోపించారు. ఈ నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, సింగూర్ ప్రాజెక్టు పరిధిలో ఇప్పటికే రెండుసార్లు క్రాప్ హాలిడే ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. మరమ్మత్తు పనులు నిర్ణీత గడువులో పూర్తి కాకపోవడంతో మరోసారి కూడా క్రాప్ హాలిడే ప్రకటించే దిశగా ప్రభుత్వ యంత్రాంగం ఆలోచిస్తున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. ఇది రైతులకు తీవ్ర ఆర్థిక నష్టాన్ని కలిగిస్తుందని అన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సింగూర్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చే అవకాశాలు ఉన్నాయని, అయితే మరమ్మత్తు పనులు పూర్తి కాకపోవడం వల్ల ఆ నీటిని నిల్వ చేయలేని పరిస్థితి నెలకొనవచ్చని మాణిక్ పేర్కొన్నారు. ఫలితంగా విలువైన వరద నీటిని ప్రాజెక్టు నుంచి దిగువకు వదిలేయాల్సిన పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీనివల్ల భవిష్యత్తులో సాగునీటి కొరత ఏర్పడి రైతులు మరింత ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని, పనుల్లో జాప్యానికి కారణమైన కాంట్రాక్టర్‌తో పాటు బాధ్యులైన ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యాన్ని కాపాడేందుకు అత్యవసర చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు ఖమ్మంలో భారీ అవగాహన ర్యాలీ

**ఖమ్మం, జూన్ 26**



అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం నగరంలో శుక్రవారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మమత రోడ్డు నుంచి లకారం ట్యాంక్‌బండ్ వరకు జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, పోలీసులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత కీలక శక్తి అని, వారి భవిష్యత్తును సురక్షితంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. యువత డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతాయని అధికారులు పేర్కొన్నారు. వ్యసనాలకు బానిస కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, విద్యార్థులు లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని వివరించారు. డ్రగ్స్ నియంత్రణలో ప్రభుత్వ యంత్రాంగం ఒక్కటే సరిపోదని, ప్రజలు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఆరోగ్యశాఖ, పోలీసులు సమిష్టిగా పనిచేసినప్పుడే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వ్యక్తి అప్రమత్తంగా ఉండి మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టడంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఎక్కడైనా డ్రగ్స్ విక్రయాలు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు గుర్తిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1908కు సమాచారం అందించాలని సూచించారు. బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించి యువత భవిష్యత్తును కాపాడేందుకు అందరూ సహకరించాలని కోరారు.

# డ్రగ్స్ రహిత సమాజానికి యువతే మార్గదర్శి

**వరంగల్, జూన్ 26**



ప్రపంచ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్ర మ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరిం చుకుని వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యం లో శుక్రవారం 2కే అవగాహన పరుగును నిర్వహించారు. పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి సంయుక్తంగా జెండా ఊపి పరుగును ప్రారం భించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుంచి ప్రారంభమైన ఈ అవగాహన పరుగు సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం వరకు కొనసాగింది. ట్రైసిటీ పరిధిలోని విద్యార్థులు, యువత, పోలీసులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. యువత మత్తు పదా ర్థాలకు పూర్తిగా దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచిం చారు. ప్రజాప్రతినిధులు, అధి కారులు మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనలో ప్రభుత్వ యంత్రాం గంతో పాటు ప్రజలు, విద్యా సంస్థలు, తల్లిదండ్రులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో అవగాహన పెంపొందించడం ద్వారా మాదకద్రవ్యాల వినియోగాన్ని సమర్థవంతంగా అరికట్టవచ్చని అభిప్రాయపడ్డారు. పరుగులో పాల్గొన్న విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజలకు సందేశాన్ని అందించారు.ం

# నారాయణపేట చేనేత చీరలను కొనుగోలు చేసిన కలెక్టర్

**నారాయణపేట, జూన్ 26**

నారాయణపేట జిల్లా జాజాపూర్ గ్రామపంచాయతీలో జిల్లా కలెక్టర్ ప్రియాంక శుక్రవారం చేనేత కార్మికులను సందర్శించి మగ్గంపై నేస్తున్న నారాయణపేట కాటన్ చీరల తయారీ ప్రక్రియను ఆసక్తిగా పరిశీలించారు. బసుదే కిష్టప్ప నివాసానికి వెళ్లిన కలెక్టర్ చేనేత కార్మికులతో ముచ్చటిస్తూ వారి పనితీరు, ఎదుర్కొంటున్న పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒక చీరను పూర్తిగా నేయడానికి ఎంత సమయం పడుతుందో, మగ్గంపై చీరల తయారీకి అనుసరించే విధానాల గురించి కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. నారాయణపేట చేనేత ప్రత్యేకతలు, సంప్రదాయ నైపుణ్యం గురించి కార్మికులు ఆమెకు వివరించారు. ఇంట్లో తయారు చేసిన కాటన్ చీరలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి వాటి నాణ్యతను అభినందించారు. చేనేత కళాకారుల శ్రమను ప్రోత్సహించే ఉద్దేశంతో అక్కడే కొన్ని చీరలను కొనుగోలు చేశారు.



దీంతో చేనేత కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. చేనేత పరిశ్రమ గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించే ముఖ్యమైన రంగమని, సంప్రదాయ వృత్తులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించినట్లు అధికారులు తెలిపారు. చేనేత ఉత్పత్తులకు మరింత మార్కెట్ కల్పించే దిశగా చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. చేనేత కార్మికుల జీవనోపాధి మెరుగుపడేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. అవసరమైన ప్రభుత్వ సహాయాలు అందేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కలెక్టర్ పర్యటనతో చేనేత కార్మికుల్లో ఉత్సాహం నెలకొంది. జిల్లా పరిపాలన నుంచి లభిస్తున్న ప్రోత్సాహం చేనేత రంగ అభివృద్ధికి దోహదపడుతుందని కార్మికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# జైలు నుంచి విడుదలైన బాల్క సుమన్

**హైదరాబాద్, జూన్ 26**

బెయిల్‌పై విడుదలైన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జైలు నుంచి విడుదలైన అనంతరం జరిగిన ఈ భేటీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా ఇద్దరూ ప్రస్తు త రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల నమోదైన కేసులో అరెస్టై 27 రోజుల పాటు జైలులో ఉన్న బాల్క సుమన్‌కు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంతో ఆయన విడుదలయ్యారు. విడుదల అనంతరం పార్టీ ముఖ్య నేతలను కలుస్తూ ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగానే కేటీఆర్‌ను కలిసి తాజా పరిణామాలపై చర్చించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, సింగరేణిలో జరుగుతున్న అంశాలు, ప్రజా సమస్యలను ప్రశ్నించినందుకే బాల్క సుమన్‌పై కేసులు నమోదు చేశారని ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఆయనను జైలుకు పంపించారని పార్టీ



నేతలు విమర్శించారు. అయితే ఈ కేసులన్నీ న్యాయస్థానంలో తేలుతాయని, ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని బాల్క సుమన్ పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రజా ప్రయోజనాల కోసం వెనుకడుగు వేయబోమని ఆయన స్పష్టం చేసినట్లు తెలిపాయి. కేటీఆర్ కూడా బాల్క సుమన్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు న్యాయబద్ధమైన పోరాటాన్ని కొనసాగించాలని సూచించినట్లు సమాచారం. బీఆర్ఎస్ నాయకులు పలువురు ఈ భేటీలో పాల్గొన్నారు. బాల్క సుమన్ విడుదల అనంతరం జరిగిన ఈ భేటీ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. దీనిపై అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. కేసు విచారణ న్యాయస్థానంలో కొనసాగుతున్న నేపథ్యంలో తదుపరి పరిణామాలపై రాజకీయ వర్గాలు దృష్టి సారించాయి.

# బీర్‌పూర్‌లో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**జగిత్యాల, జూన్ 26**

జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాలకు ఆధునిక వైద్య సేవలను చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన



అవసరం లేకుండా అన్ని సౌకర్యాలను స్థానికం గానే అందుబాటులోకి తీసుకు వస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది, అవసరమైన మందులు, వైద్య పరికరాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారు లను ఆదేశించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.నూతన ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి సేవలు, ప్రాథమిక చికిత్స, టీకాలు, సాధారణ వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు వంటి సేవలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సమయానికి వైద్య సేవలు అందించడం ద్వారా ఆరోగ్య సమస్యలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత, వైద్య సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వివాహేతర సంబంధం.. భర్త హత్య

**నాగర్‌కర్నూల్, జూన్ 26**

నాగర్‌కర్నూల్ జిల్లాలో వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్త హత్యకు గురైన ఘటన సంచలనం సృష్టించింది. తొలుత అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులను నమ్మించే ప్రయత్నం జరిగిన ప్పటి కీ, శవంపై అనుమానాస్పద గాయా లను గుర్తించిన బంధు వులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకా రం, మృతుడి భార్యకు తన అల్లుడితో వివాహేతర సంబంధం ఉన్నట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడనే కారణంతో హత్యకు పాల్పడినట్లు ఆమె ప్రాథమిక విచారణలో అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే ఈ అంశంపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. ఘటన అనంతరం మృతుడు అనారోగ్యంతో మరణించినట్లు బంధువులను నమ్మించే ప్రయత్నం జరిగినట్లు పోలీసులు తెలిపారు. అయితే మృతదేహంపై గాయాలున్నట్లు గమనించిన కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేసి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించి విచారణ ప్రారంభించారు. విచారణలో భార్య పాత్రపై అనుమానాలు బలపడగా, ఘటనలో కూతురు, అల్లుడి ప్రమేయం కూడా ఉండొచ్చనే అనుమానంతో వారిపైనా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వాంగ్మూ లాలు, సాంకేతిక ఆధారా లు, ఇతర సాక్ష్యాలను సేకరిస్తూ దర్యాప్తును కొనసాగిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమా ర్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమా ర్టం నివేదికతో పాటు



ఫోరెన్సిక్ ఆధారాల ఆధారంగా కేసులో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. అవసరమైతే మరికొందరిని కూడా విచారించే అవకాశం ఉందని తెలిపారు. ఈ ఘటన జిల్లాలో తీవ్ర సంచలనం రేపింది. కేసుకు సంబంధించిన అన్ని కోణాలను పరిశీలిస్తున్నామని, దర్యాప్తు పూర్తయిన అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

# ఈ నెల 28న పల్స్ పోలియో కార్యక్రమం

**హైదరాబాద్, జూన్ 26**

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28 నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జూన్ 28న పోలియో బూత్‌ల ద్వారా, జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో పట్టణ ప్రాంతాలు అధికంగా ఉండటంతో జూలై 1న అదనంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 22,979 పోలియో బూత్‌లు, 903 మొబైల్ బృందాలు, 903 ట్రాన్సిట్ పాయింట్లు



ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. సుమారు 40.97 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 52.04 లక్షల బీవోపీవీ టీకా డోసులు జిల్లాలకు సరఫరా చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు. వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, పట్టణ బస్తీలు, కొత్త కాలనీలు, గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులకు ప్రత్యేకంగా పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఆర్టీసీ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. తెలంగాణలో చివరి పోలియో కేసు 2007లో నమోదైందని అధికారులు గుర్తు చేశారు. పోలియో రహిత హోదాను కొనసాగించేందుకు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయడం అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. గతంలో పోలియో చుక్కలు వేసినా మరోసారి వేయించడం వల్ల పూర్తి రక్షణ లభిస్తుందని వివరించారు. ం



## తెలంగాణ
# కొత్త సీఎస్‌గా సంజయ్ జా

**హైదరాబాద్, జూన్ 26**

తెలంగాణ రాష్ట్ర కొత్త ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో విధులు నిర్వహిస్తున్న ఆయనను రాష్ట్ర పరిపాలనలో అత్యున్నత అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 1992 బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజు కేంద్ర ప్రభుత్వంలోని ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పనిచేశారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణా వ్యవహారాల శాఖ ఇటీవల ఆయనను పేరెంట్ కేడర్‌కు బదిలీ చేసింది. మూడు రోజుల క్రితమే ఆయన కేంద్ర సర్వీసుల నుంచి రిలీవ్ అయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కే. రామకృష్ణారావు పదవీకాలం ఈ నెల 30తో ముగియనుంది. దీంతో తదుపరి సీఎస్‌గా సంజయ్ జాజును నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరిపాలనలో సుదీర్ఘ అనుభవం ఉన్న అధికారిగా ఆయనకు గుర్తింపు ఉంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జులై 1 నుంచి సంజయ్ జాజు అధికారికంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టనున్నారు. రాష్ట్ర పరిపాలనా వ్యవస్థలో కీలకమైన ఈ పదవిలో ఆయన ప్రభుత్వ విధానాల అమలు, వివిధ శాఖల సమన్వయం, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ వంటి బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పలు కీలక హోదాల్లో పనిచేసిన అనుభవం సంజయ్ జాజుకు ఉంది. ముఖ్యంగా పరిపాలన, విధానాల రూపకల్పన, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఆయనకు విశేష అనుభవం ఉండటంతో రాష్ట్ర పరిపాలనకు ఆయన సేవలు ఉపయోగపడతాయని అధికారులు భావిస్తున్నారు.



## కాముని చెరువు పునరుద్ధరణ
# పనులకు శ్రీకారం

**హైదరాబాద్, జూన్ 26**


వరదల నియంత్రణ, భూగర్భ జలాల పెంపుదల లక్ష్యంగా కూకట్‌పల్లి మండలం మూసాపేటలోని 48 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాముని చెరువు పునరుద్ధరణ పనులకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు. చెరువు పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెరువులో పేరుకుపోయిన పూడికను పూర్తిస్థాయిలో తొలగించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లను ఆధునికీకరించి వర్షపు నీటి ప్రవాహం సాఫీగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. చెరువును కేవలం నీటి వనరుగా మాత్రమే కాకుండా ప్రజలకు ఆహ్లాదకరమైన విహార ప్రదేశంగా తీర్చిదిద్దాలని కమిషనర్ సూచించారు. ఇందులో భాగంగా వాకింగ్ పాత్‌వేలు, ఓపెన్ జిమ్, పిల్లల ఆట స్థలం, పచ్చదనం పెంపు వంటి సౌకర్యాలను అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పనుల అమలులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాముని చెరువు పునరుద్ధరణతో వరద ముప్పు తగ్గడంతో పాటు భూగర్భ జలాల మట్టాలు పెరిగి పరిసర ప్రాంతాలకు మేలు జరుగుతుందని అధికారులు తెలిపారు. చెరువు పరిరక్షణ ద్వారా పర్యావరణ సమతుల్యత కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. భూమిపూజ కార్యక్రమంలో హైడ్రా అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. చెరువు పునరుద్ధరణతో మూసాపేట ప్రాంత ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



## రూ.45 లక్షల బంగారం అప్పగించిన మహిళ

**తిరుపతి, జూన్ 26**

డబ్బు, బంగారం కనిపిస్తే స్వాధీనం చేసుకునే ఘటనలు పెరుగుతున్న ఈ రోజుల్లో తిరుపతికి చెందిన ఓ హోటల్ క్యాషియర్ తన నిజాయతీతో అందరి ప్రశంసలు అందుకున్నారు. హోటల్‌లో మరిచిపోయిన సుమారు రూ.45 లక్షల విలువైన 300 గ్రాముల బంగారు ఆభరణాలను భద్రంగా దాచిపెట్టి యజమానులకు అప్పగించి ఆదర్శంగా నిలిచారు. ఆమె నిజాయతీతో ఓ పెళ్లింట ఆనందం మళ్లీ తిరిగి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం బెంగళూరుకు చెందిన శ్రీభరత్‌కుమార్ కుటుంబం తిరుమలలో వివాహ కార్యక్రమం ముగించుకుని తిరుగు ప్రయాణంలో తిరుపతిలోని జూపార్క్ రోడ్డులో ఉన్న ఓ హోటల్‌లో భోజనం చేశారు. అనంతరం బెంగళూరుకు చేరుకున్న తర్వాత తమ హ్యాండ్‌బ్యాగ్ కనిపించడం లేదని గుర్తించారు. ఆ బ్యాగులో వివాహానికి సంబంధించిన సుమారు 300 గ్రాముల బంగారు ఆభరణాలు ఉండటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.



## ఆధార్‌తోనే ధృవపత్రాల డిజిటల్ ధృవీకరణకు ఆదేశం

**అమరావతి, జూన్ 26**

ఆధార్ నంబర్ నమోదు చేయగానే అభ్యర్థికి సంబంధించిన విద్య, క్రీడా ధృవపత్రాలన్నీ డిజిటల్‌గా ధృవీకరించే పారదర్శకమైన, పటిష్ఠమైన వ్యవస్థను తక్షణమే అభివృద్ధి చేయాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఈ విధానం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ధృవపత్రాల పరిశీలన వేగవంతమవడంతో పాటు లక్షలాది మంది అభ్యర్థులకు ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. అభ్యర్థి ఆధార్ నంబర్ నమోదు చేసిన వెంటనే సంబంధిత ధృవపత్రాన్ని ఏ సంస్థ, ఎప్పుడు, ఎవరు జారీ చేశారనే వివరాలు రియల్‌టైమ్‌లో అందుబాటులోకి వచ్చేలా 'డిజి వెరిఫై' వ్యవస్థను రూపొందించాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి లోకేశ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని ఒకే వేదికపై సమీకరించే 'డేటా లేక్' పనులను జులై నెలలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



## సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు అండగా ప్రభుత్వం

**టెక్కలి, జూన్ 26**

ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు మెరుగైన వైద్య సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శుక్రవారం కోటబొమ్మాళి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గానికి చెందిన 48 మంది లబ్ధిదారులకు రూ.38.71 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించి వారి ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరప్రసాదంగా మారిందని పేర్కొన్నారు. టెక్కలి నియోజకవర్గంలో ఇప్పటివరకు 389 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.3.76 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.

## వేలంలో అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ ఆరోపణ

**హనుమకొండ, జూన్ 26**




హనుమకొండలోని భారత రాష్ట్ర సమితి జిల్లా కార్యాలయంలో నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. గత రెండున్నరేళ్లుగా ప్రతి అంశంలో బీఆర్ఎస్‌పైనే ఆరోపణలు చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం మరిచిపోయారని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కుడా పేరుతో అభివృద్ధికి బదులుగా అవినీతి జరుగుతోందని దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోనవుతున్నారని, పారదర్శకంగా నిర్వహించాల్సిన కుడా ప్లాట్ల వేలాన్ని ఆఫ్‌లైన్‌లో నిర్వహించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇటీవల నిర్వహించిన వేలంలో అక్రమాలు జరిగాయని, వెంటనే ఆ వేలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యాదవ్‌నగర్--రెడ్డిపురం మార్గంలోని చెరువును చట్టాలకు విరుద్ధంగా పూడ్చివేస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనివల్ల పక్షులు, జలచరాలు, పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. పేదల ఇళ్లను కూల్చివేయడం కాకుండా వారికి పట్టాలు ఇవ్వాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను స్థానిక అర్హులకే కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ముద్రగడ పద్మనాభంను పరామర్శించిన బొత్స సత్యనారాయణ

**హైదరాబాద్, జూన్ 26**



హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనా భంను మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ శుక్రవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ని వైద్యులను అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దాడిశెట్టి రాజా, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, దవులూరి దొరబాబు, కదిరి బాబురావు, జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్‌తో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు బొత్స సత్యనారాయణ వెంట ఉన్నారు. ముద్రగడ పద్మనాభంకు ధైర్యం చెబుతూ మెరుగైన వైద్యం అందుతోందని తెలుసుకున్నారు. అనంతరం ముద్రగడ పద్మనాభం తనయుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబును కలిసి కుటుంబ సభ్యులకు బొత్స సత్యనారాయణ ధైర్యం చెప్పారు. చికిత్సపై ఆందోళన చెందవద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముద్రగడ పద్మనాభం త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని మళ్లీ ప్రజా జీవితంలో చురుకుగా పాల్గొనాలని బొత్స సత్యనారాయణ ఆకాంక్షిం చారు. ఆయన త్వరగా కోలుకోవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్సకు సంబంధించిన వివరాలను వైద్యులు బొత్స సత్యనారాయణకు వివరించినట్లు సమాచారం. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి మెరుగుపడాలని ఆకాంక్షిస్తూ పార్టీ నాయకులు, అభిమానులు సందేశాలు పంపుతున్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకుని ప్రజాసేవలో తిరిగి చురుకైన పాత్ర పోషించాలని వారు ఆకాంక్షించారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: పల్లా శ్రీనివాసరావు

**విశాఖపట్నం, జూన్ 26**

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గాజువాక నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను స్వయంగా కలుసుకుని వారి సమస్యలు, వినతులను శ్రద్ధగా ఆలకించారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తాగునీరు, రహదారులు, విద్యుత్, రెవెన్యూ, సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి వినతిని నమోదు చేసి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించాలని పల్లా శ్రీనివాసరావు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడానికే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలకు త్వరగా పరిష్కారం చూపడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే తన ప్రాధాన్యత అని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రతి సమస్యపై బాధ్యతాయుతంగా స్పందించి పరిష్కారం చూపేందుకు నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.

## రేపు రాష్ట్రంలో భారీ వర్షాల సూచన


**అమరావతి, జూన్ 26**

ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో శనివారం పలు జిల్లాల్లో చెదురుమదురుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రకర్ జైన్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు కాకినాడ, కోనసీమ, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశముందని పేర్కొన్నారు. వర్షాల సమయంలో పిడుగుల ప్రమాదం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు, వ్యవసాయ కూలీలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉరుములు, మెరుపులు కనిపించిన వెంటనే సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని తెలిపారు. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉన్నందున ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. వాగులు, వంకలు, నీటి ప్రవాహాలను దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. మత్స్యకారులు సముద్ర పరిస్థితులను గమనిస్తూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.



## గ్రీవెన్స్‌లో ప్రజల వినతుల స్వీకరణ

**అద్దంకి, జూన్ 26**



సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను స్వయంగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ వర్గాలకు చెందిన ప్రజలు తాగునీరు, రహదారులు, రెవెన్యూ, సంక్షేమ పథకాలు, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించడమే గ్రీవెన్స్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు పారదర్శక పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండదని స్పష్టం చేశారు. ప్రతి అర్జీపై అధికారులు బాధ్యతాయుతంగా స్పందించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజలకు జవాబుదారీతనంతో సేవలు అందించాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు.



## తాడిపత్రిలో మళ్లీ రాజకీయ ఉద్రిక్తత

**అనంతపురం, జూన్ 26**

అనంతపురం జిల్లా తాడిపత్రిలో మరోసారి రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వర్గాలు ఒకే రోజు వేర్వేరుగా నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి వర్గీయులు తాడిపత్రిలోని గాంధీ విగ్రహం వద్ద సామూహిక దీక్ష చేపడతామని ప్రకటించారు. అయితే ఈ దీక్షను అడ్డుకుంటామని టీడీపీ నేతలు ప్రకటించడంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత మరింత పెరిగింది. అదే సమయంలో టీడీపీ వర్గం అనంతపురంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేల ఇళ్ల ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసనలు చేపడతామని ప్రకటించింది. జిల్లాలో మొహరం వేడుకలు, వీవీఐపీల పర్యటనలు ఒకేసారి ఉండటంతో భద్రతా ఏర్పాట్లపై ఒత్తిడి నెలకొన్న నేపథ్యంలో ఇరువర్గాల కార్యక్రమాలకు అనుమతి ఇవ్వలేమని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజా శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని ఇరు పక్షాల నిరసనలకు అనుమతి నిరాకరించారు. ఇరు వర్గాల నాయకులకు ముందస్తుగా చట్టపరమైన నోటీసులు జారీ చేసిన పోలీసులు శాంతి భద్రతలకు సహకరించాలని సూచించా రు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు ఆయన నివాసంలోనే గృహనిర్బంధం చేశారు. ఆయన ఇంటి వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు తాడిపత్రిలోని గాంధీ సర్కిల్, ఇతర సున్నిత ప్రాంతాల్లో కూడా అదనపు పోలీసు బలగాలను మోహరించారు.




## డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌కు అందరూ భాగస్వాములు కావాలి

**విజయవాడ, జూన్ 26**

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరుకాగా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వక్తలు తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజలు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, యువత సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ దుష్పరిణామాలను వివరించే ప్రత్యేక అవగాహన ప్రదర్శన లు ఏర్పాటు చేయడంతో పాటు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వ హించారు. మత్తు పదార్థాల వల్ల వ్యక్తిగత జీవి తం, కుటుంబం, సమాజం తీవ్రంగా దెబ్బ తింటుందని వివరించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని వక్తలు సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మా ణానికి ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యత నిర్వ ర్తించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ అక్రమ రవా ణా, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యక లాపాలపై వెంటనే అధికారులకు సమా చారం అందించాలని సూచించారు. సమాజంలో అవగాహన పెంపొందించడం ద్వారానే మాదక ద్రవ్యాల సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని అభిప్రాయపడ్డారు.

# వైభవ్ సూర్యవంశీపై ప్రపంచ దృష్టి.. అశ్విన్ కీలక సూచన

**బెల్ఫాస్ట్, జూన్ 26**

భారత క్రికెట్‌లో కొత్త సంచలనంగా మారిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీపై ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానుల దృష్టి కేంద్రీకృతమైంది. భారత జట్టులో ఎంపికైన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించిన ఈ యువ ఆటగాడు, రాబోయే ఐర్లాండ్ మరియు ఇంగ్లాండ్ సిరీస్‌ల నేపథ్యంలో ప్రత్యేకంగా చర్చనీయాంశంగా మారాడు. ఈ నేపథ్యంలో సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ వైభవ్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. చిన్న వయసులోనే అతనిపై భారీ అంచనాలు పెరగడం సహజమని, అయితే ఆ ఒత్తిడిని పక్కన పెట్టి తన సహజ ఆటను ఆస్వాదించాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో ఆడేటప్పుడు వచ్చే ఒత్తిడిని తగ్గించుకుని, తాను చిన్నప్పుడు వీధుల్లో క్రికెట్ ఆడినట్లే స్వేచ్ఛగా ఆడాలని అశ్విన్ అభిప్రాయపడ్డారు. వైభవ్ ఇటీవల ఇండియా ఏ జట్టు తరపున శ్రీలంకలో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో అద్భుత ప్రదర్శన ఇచ్చిన విషయాన్ని అశ్విన్ ప్రశంసించారు. ఫైనల్ మ్యాచ్‌లో అతను జట్టు విజయానికి కీలకంగా నిలిచే ఇన్నింగ్స్ ఆడినట్లు గుర్తుచేశారు. అతని బ్యాటింగ్‌లో ఉన్న దూకుడుతో పాటు పరిస్థితులకు తగ్గట్టుగా ఆడగల సామర్థ్యం అతన్ని ప్రత్యేక ఆటగాడిగా నిలబెడుతోందని తెలిపారు. మొత్తానికి వైభవ్ సూర్యవంశీపై ఉన్న అంచనాలు భారీగా ఉన్నప్పటికీ, అతని సహజ ఆటే అతని పెద్ద బలం అవుతుందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# ఐరిష్ బోర్డు నిర్వాకంపై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆగ్రహం

**బెల్ఫాస్ట్, జూన్ 26**

భారత్, ఐర్లాండ్ మధ్య జరగనున్న రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం బెల్ఫాస్ట్ చేరుకున్న టీమిండియాకు తొలి రోజే అసౌకర్యకర పరిస్థితి ఎదురైంది. ప్రాక్టీస్ కోసం కేటాయించిన మైదానంలో కనీస సౌకర్యాలు లేకపోవడంపై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు టీమ్ మేనేజ్‌మెంట్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ముఖ్యంగా బ్యాటింగ్ ప్రాక్టీస్ సమయంలో అవసరమైన సైట్ స్క్రీన్ లేకపోవడం వల్ల సెషన్‌కు తాత్కాలిక అంతరాయం ఏర్పడింది. టీ20 క్రికెట్‌లో బ్యాట్స్‌మెన్‌కు బంతి స్పష్టంగా కనిపించేందుకు సైట్ స్క్రీన్ అత్యంత కీలకం. ఈ అంశాన్ని గుర్తించిన భారత సపోర్ట్ స్టాఫ్ వెంటనే ఐర్లాండ్ క్రికెట్ బోర్డుకు సమాచారం ఇచ్చింది. అనంతరం ఐరిష్ అధికారులు స్పందించి తక్షణమే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇదే సిరీస్‌తో 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరంగేట్రంపై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. నెట్స్ సెషన్‌లో హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్ వంటి బౌలర్లను ఎదుర్కొని అతను ఆకట్టుకున్నట్లు సమాచారం. అయితే తుది జట్టులో వైభవ్‌కు అవకాశం దక్కే విషయంపై ఇంకా స్పష్టత లేదు. జట్టులో ఇప్పటికే ఓపెనింగ్ స్థానాలకు తీవ్ర పోటీ ఉండటంతో మేనేజ్‌మెంట్ తుది నిర్ణయం మ్యాచ్‌కు ముందు తీసుకునే అవకాశం ఉంది.



# శ్రేయస్ అయ్యర్ ఇన్‌స్టా బయో మార్పు..

## 'రెండో పుట్టినతేదీ' చర్చకు తెర

**న్యూఢిల్లీ, జూన్ 26**


టీమిండియా టీ20 జట్టుకు నూతన కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రేయస్ అయ్యర్ తన తొలి మ్యాచ్‌కు ముందే సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చకు కారణమయ్యాడు. ఐర్లాండ్‌తో జరుగుతున్న తొలి టీ20కి కొన్ని గంటల ముందు ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ బయోను అప్‌డేట్ చేస్తూ "రెండో పుట్టినతేదీ: 25.12.2025" అనే ఎంట్రీని జతచేశాడు. ఈ మార్పు అభిమానుల్లో, క్రికెట్ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేపింది. అయ్యర్ అసలు పుట్టినతేదీ 1994 డిసెంబర్ 6 కాగా, ఈ కొత్త తేదీ వెనుక భావోద్వేగ కారణం ఉందని అంచనా వేస్తున్నారు. గతంలో తీవ్రమైన గాయానికి గురైన తర్వాత పూర్తిగా కోలుకున్న రోజును గుర్తుగా ఆయన ఈ తేదీని 'రెండో జీవితం' ప్రారంభమైన రోజుగా భావించినట్లు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన వన్డేలో ఫీల్డింగ్ సమయంలో అయ్యర్ తీవ్రంగా గాయపడి కొంతకాలం ఆటకు దూరమయ్యారు. ప్రాణాంతక పరిస్థితి నుంచి కోలుకుని తిరిగి మైదానంలోకి రావడం ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. ఇక నాయకత్వ పరంగా కూడా శ్రేయస్ అయ్యర్ తనను తాను ఇప్పటికే నిరూపించుకున్నారు. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఫైనల్‌కు, కోల్‌కతా నైట్ రైడర్స్‌ను టైటిల్ విజేతగా, పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్‌కు తీసుకెళ్లిన అనుభవం ఆయనకు కలిసొచ్చింది. ఈ అనుభవాన్ని పరిగణలోకి తీసుకున్న బీసీసీఐ, టీ20 జట్టుకు కొత్త కెప్టెన్‌గా ఆయనను ఎంపిక చేసింది. ప్రస్తుతం అయ్యర్ నాయకత్వంలోని భారత జట్టు ఐర్లాండ్‌తో రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతోంది. బెల్ఫాస్ట్‌లోని సివిల్ సర్వీస్ క్రికెట్ గ్రౌండ్‌లో తొలి మ్యాచ్ జరుగుతుండగా, ఈ సిరీస్ ఇంగ్లాండ్ పర్యటనకు సన్నాహకంగా భావిస్తున్నారు.



# క్రికెట్ దిగ్గజాలకు గౌరవ హోదాలు.. దేశ సేవలోనూ ప్రత్యేక గుర్తింపు

**న్యూఢిల్లీ, జూన్ 26**

మైదానంలో ప్రత్యర్థులను చిత్తు చేసి భారత క్రికెట్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకువచ్చిన పలువురు దిగ్గజ ఆటగాళ్లు, దేశ సేవలోనూ తమదైన ముద్ర వేశారు. బ్యాట్, బాల్‌తో కోట్లాది అభిమానులను సంపాదించిన ఈ స్టార్ క్రికెటర్లకు భారత సైన్యం, పోలీస్ శాఖలు గౌరవ హోదాలు ప్రదానం చేసి గౌరవించింది. క్రమశిక్షణ, దేశభక్తి, సమాజ సేవకు గుర్తింపుగా ఈ హోదాలను అందుకున్న వీరు, క్రీడలతో పాటు సేవా రంగంలోనూ ఆదర్శంగా నిలుస్తున్నారు. భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీకి ఇండియన్ టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్ గౌరవ హోదా లభించింది. ధోనీ తన విధుల్లో భాగంగా సైనికులతో కలిసి శిక్షణలో పాల్గొనడం ప్రత్యేకతగా నిలిచింది. 1983 ప్రపంచకప్ విజేత కెప్టెన్ కపిల్ దేవ్‌కు కూడా భారత సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్ గౌరవ ర్యాంక్ అందించారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు భారత వైమానిక దళం గ్రూప్ కెప్టెన్ గౌరవ హోదాను ప్రదానం చేసింది. ఇక భారత స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు తెలంగాణ పోలీస్ శాఖ డీఎస్పీ గౌరవ హోదా ఇచ్చింది. అలాగే మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్, భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు పంజాబ్ పోలీస్‌లో డీఎస్పీ హోదాలు లభించాయి. క్రీడల్లో విశేష సేవలందించిన వారికి రాష్ట్ర ప్రభుత్వాలు, రక్షణ దళాలు, పోలీస్ శాఖలు ఇలాంటి గౌరవ హోదాలు ప్రదానం చేస్తుంటాయి. మైదానంలో విజయాలతో దేశానికి కీర్తి తీసుకురావడమే కాకుండా, దేశ సేవకు ప్రతీకలైన గౌరవ హోదాలను అందుకోవడం ద్వారా ఈ క్రికెటర్లు యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆటలో క్రమశిక్షణ, జీవితంలో దేశభక్తి కలిసినప్పుడు ఎంతటి గౌరవం దక్కుతుందో ఈ దిగ్గజాల ప్రయాణం మరోసారి చాటి చెబుతోంది.



# వైస్ కెప్టెన్ అయినంత మాత్రాన.. ప్లేస్ ఫిక్స్ కాదు: మహ్మద్ కైఫ్

**ఐర్లాండ్:** ఐర్లాండ్ టీ20 సిరీస్‌తో భారత ప్లేయర్లు శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ కొత్త బాధ్యతలు తీసుకుంటారు. శ్రేయస్ కెప్టెన్ కాగా.. తిలక్ వైస్ కెప్టెన్‌గా ఎంపికైన సంగతి తెలిసిందే. అయితే, డిప్యూటీ సారథి అయినంత మాత్రాన జట్టులో స్థానం సుస్థిరం కాదని మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ సున్నితంగా హెచ్చరించాడు. తిలక్ కెరీర్‌లో ఇదొక గుర్తించదగిన మైలు రాయి అని.. అదేవిధంగా అంచనాలు, బాధ్యతలు కూడా భారీగానే ఉంటాయని వ్యాఖ్యానించాడు. "తిలక్ వర్మ ఇప్పుడు వైస్ కెప్టెన్‌గా ప్రమోషన్ అందుకొన్నాడు. డిప్యూటీ అయినంత మాత్రాన అతడికి తుది జట్టులో స్థానం గ్యారంటీ అని అర్థం కాదు. అలా ఆలోచిస్తే మాత్రం ఇబ్బందులు తప్పవు. అతడు జట్టులో ఉండాలనుకుంటే.. ఫామ్‌ను కొనసాగించాలి. పరుగులు చేయలేకపోతే వైస్ కెప్టెన్ అయినా జట్టులో స్థానం ఉండదు. ఇంతకుముందు అక్షర్ పటేల్, శుభ్‌మన్ గిల్ పరిస్థితి కూడా ఇదే. తిలక్ వర్మ వారిద్దరినీ గుర్తు పెట్టుకోవాలి" అని కైఫ్ తెలిపాడు.






# ఐర్లాండ్‌తో తొలి టీ20కు సిద్ధమైన టీమిండియా

**బెల్‌ఫాస్ట్, జూన్ 26**

ఐర్లాండ్‌తో ఇవాళ జరగనున్న తొలి టీ20 మ్యాచ్‌కు టీమిండియా సిద్ధమైంది. బెల్‌ఫాస్ట్ వేదికగా జరుగనున్న ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ మ్యాచ్‌కు ముందు 15 ఏళ్ల యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ నెట్స్‌లో చేసిన ప్రాక్టీస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తుది జట్టులో అతనికి అవకాశం దక్కుతుందా లేదా అన్నది ఇంకా స్పష్టత రాకపోయినా, తొలిసారి టీమిండియా సీనియర్ ఆటగాళ్లతో కలిసి అతను తీవ్రంగా సాధన చేశాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో అగ్రశ్రేణి బౌలర్లపై దూకుడుగా ఆడిన వైభవ్, అదే ఆత్మవిశ్వాసంతో నెట్స్‌లోనూ భారీ షాట్లు కొట్టాడు. బౌలర్లను భయపడకుండా ఎదుర్కొంటూ వివిధ షాట్లతో ఆకట్టుకున్నాడు. ఈ ప్రాక్టీస్ వీడియోను బీసీసీఐ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేయగా, ప్రస్తుతం అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యువ ఓపెనర్ ప్రదర్శన టీమిండియా బ్యాటింగ్ లైనప్‌కు కొత్త ఉత్సాహం తెచ్చేలా కనిపిస్తోంది.




# ఆన్‌లైన్ ట్రోలింగ్.. మహిళా క్రీడాకారులకు ఐసీసీ అండ

**ఇంటర్నెట్‌డెస్క్**

ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో ట్రోలింగ్ (Social Media Trolling) పెరిగింది. క్రీడాకారిణులు, హీరోయిన్లపై దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో టీ20 ప్రపంచకప్‌లో ఆడుతున్న క్రికెటర్లు ట్రోలింగ్ బారిన పడకుండా ఐసీసీ పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఏఐ సంస్థ ఫ్రీడమ్2హియర్‌తో కలిసి 'ఐసీసీ ప్లేయర్ ప్రొటెక్షన్ ప్రోగ్రామ్' (ICC player Protection Program)ను తీసుకొచ్చింది. ప్రత్యేక టూల్ ద్వారా.. అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న మహిళా ప్లేయర్ల సోషల్ మీడియా ఖాతాలను నిశితంగా గమనిస్తూ, వారు ట్రోలింగ్ బారిన పడకుండా చూడటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఇప్పటి వరకు క్రీడాకారులను ఇబ్బంది పెట్టేలా ఉన్న దాదాపు 60,000కు పైగా పోస్టులను తొలగించారు. 2024 మహిళల టీ20 ప్రపంచకప్ సమయంలో ఐసీసీ ఈ టూల్‌ను తీసుకొచ్చింది. కానీ, తాజా టీ20 ప్రపంచకప్ సీజన్ మొదలైన తర్వాత ప్లేయర్ ప్రొటెక్షన్ ప్రోగ్రామ్‌లో చేరిన వారి సంఖ్య అమాంతం పెరిగింది. తమను ట్రోలింగ్ నుంచి రక్షించాల్సిందిగా 50 మంది క్రికెటర్లు విజ్ఞప్తి చేసినట్లు ఐసీసీ తాజాగా వెల్లడించింది. ఇప్పటి వరకు 100 మందికి పైగా మహిళా క్రీడాకారులు ఇందులో సభ్యులుగా చేరారు. ఐసీసీ సోషల్ మీడియా ఖాతాలకు అదనపు భద్రత చేకూర్చాలనే ఉద్దేశంతో తొలుత దీనిని తీసుకొచ్చారు. కానీ, క్రీడాకారిణులపై ట్రోలింగ్ ఎక్కువవుతున్న నేపథ్యంలో.. మొత్తం 12 జట్లలో కీలకమైన 7 జట్ల సభ్యులతోపాటు, అంపైర్లు, బ్రాడ్‌క్యాస్టర్ల అధికారిక ఖాతాలకు కూడా రక్షణ కల్పిస్తున్నట్లు ఐసీసీ ప్రకటనలో పేర్కొంది. టీ20 ప్రపంచకప్ ప్రారంభమైన వారం రోజుల్లోనే ఈ టూల్ 2,50,000 కామెంట్లను రివ్యూ చేసి.. ఇబ్బందికరంగా ఉన్న 60,000 కామెంట్లను తొలగించినట్లు పేర్కొంది. ఇతరులను కించపరిచేలా తరచూ కామెంట్లు చేస్తున్న 2000 మందిని గుర్తించి వారిపై తాత్కాలిక నిషేధం విధించామని, మరో 370 మందిని బ్లాక్ చేసినట్లు పేర్కొంది. సోషల్ మీడియా మరీ ఇబ్బందికరంగా మారుతున్న తరుణంలోనే ఈ ప్రోగ్రామ్‌లో చేరాల్సి వచ్చిందని స్పిన్నర్ రాధా యాదవ్ పేర్కొంది. "స్నేహితులు, కుటుంబ సభ్యులు, అభిమానులతో సరదాగా మాట్లాడుకునేందుకు సోషల్ మీడియా అద్భుతమైన ప్లాట్‌ఫాం. కానీ, అది క్రమంగా విషపూరితమవుతోంది. ముఖ్యంగా మహిళా క్రీడాకారులను తీవ్ర ఇబ్బంది పెడుతోంది" అని తెలిపింది.

## నటి ఇంట్లో వ్యాపారవేత్త
# ఆత్మహత్య

**బెంగళూరు, జూన్ 26**

బెంగళూరులోని ఆర్‌ఆర్ నగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. కన్నడ నటి, మోడల్, మాజీ బిగ్‌బాస్ కన్నడ పోటీదారు కృషి తపాండ నివాసంలో 33 ఏళ్ల వ్యాపారవేత్త వైశాఖ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గిరినగర్‌కు చెందిన వైశాఖ్ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు అసహజ మరణంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, గత కొన్ని రోజులుగా వైశాఖ్ ఆర్‌ఆర్ నగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. ఘటన జరిగిన సమయంలో కృషి తపాండ ఇంట్లో అతను ఒంటరిగా ఉన్నట్లు గుర్తించారు. ఘటనాస్థలంలో ఎలాంటి ఆత్మహత్యా లేఖ గానీ, వీడియో సందేశం గానీ లభించలేదని పోలీసులు వెల్లడించారు. ఘటనకు కొద్దిసేపటి ముందు వైశాఖ్ కృషి తపాండను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఆ సమయంలో ఆమె నెలమంగళలో ఉండటంతో ఫోన్‌కు స్పందించలేకపోయినట్లు తెలిసింది. అనంతరం తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు సూచించే సందేశాలను ఆమెకు పంపినట్లు సమాచారం. ఆ సందేశాలను గమనించిన కృషి వెంటనే వైశాఖ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే వారు అక్కడికి చేరుకునేలోపే వైశాఖ్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం వైశాఖ్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మరణానికి గల కారణాలను గుర్తించేందుకు ఫోన్ వివ రాలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాది ప్రారంభంలో వైశాఖ్ మరో కేసులో కూడా అరెస్ట య్యాడు. వ్యాపారవేత్త అరవింద్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెదిరింపులు, దోపిడీ ఆరోపణలతో నమోదైన కేసులో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బెయిల్‌పై విడుదలైనట్లు సమా చారం. కృషి తపాండ 2016లో 'అకీర' చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టారు. అనంతరం 'ఎరడు కనసు', 'కన్నడ క్కాగి ఒందన్ను ఒట్టి' చిత్రాల్లో నటించారు. అలాగే బిగ్‌బాస్ కన్నడ ఐదో సీజన్‌లో పాల్గొని గుర్తింపు పొందారు. ఇటీవల 'గణ' చిత్రంలోనూ కీలక పాత్రలో కనిపించారు. ఈ ఘటనపై కృషి తపాండ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.






## 'రణబాలి'పై పుకార్లు
# ఖండించిన నిర్మాత

**హైదరాబాద్, జూన్ 26**

నటుడు విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రూపొందుతున్న పీరియడ్ యాక్షన్ చిత్రం 'రణబాలి' గురించి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ప్రచారాలను చిత్ర యూనిట్ తీవ్రంగా ఖండించింది. షూటింగ్ సమయంలో విజయ్ దేవరకొండ తన కోసం ఐదు నుంచి ఆరు కారవాన్లు, 40 నుంచి 50 మంది సహాయకులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారని, ఈ వ్యవహారంపై నిర్మాతలు నిర్మాతల మండలిని ఆశ్రయించారంటూ ప్రచారంలో ఉన్న సమాచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. ఈ అంశంపై చిత్ర నిర్మాత, మైత్రీ మూవీ మేకర్స్ అధినేత వై. రవిశంకర్ స్పందిస్తూ, విజయ్ దేవరకొండ అత్యంత క్రమశిక్షణతో, వృత్తిపరమైన నిబద్ధతతో పనిచేసే నటుడని తెలిపారు. సినిమా చిత్రీకరణలో ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని, ప్రచారంలో ఉన్న కథనాలకు ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. విజయ్ దేవరకొండ బృందం కూడా ఈ ప్రచారాన్ని ఖండించింది. కావాలనే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆరోపిస్తూ, ఇలాంటి ప్రచారాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇదిలా ఉండగా, 'రణబాలి' చిత్రంపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దర్శకుడు రాహుల్ సాంకృత్యాయన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ సరసన రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్నారు.





## శృతి హాసన్ క్లారిటీ.. ప్రస్తుతం
# రిలేషన్‌షిప్‌లో లేను

**హైదరాబాద్, జూన్ 26**

సినీ నటి శృతి హాసన్ వ్యక్తిగత జీవితం గురించి గత కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆమె ప్రేమ వ్యవహారంపై వస్తున్న ప్రచారాలకు తాజాగా ఆమె స్వయంగా స్పందిస్తూ పూర్తి స్పష్టత ఇచ్చారు. అభిమానులతో నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సందేహాలకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఓ అభిమాని ప్రస్తుతం ఎవరితోనైనా ప్రేమ సంబంధంలో ఉన్నారా అని ప్రశ్నించగా, తాను ప్రస్తుతం ఎవరితోనూ ఎలాంటి ప్రేమ సంబం ధంలో లేనని శృతి హాసన్ స్పష్టం చేశారు. దీంతో ఆమె డేటింగ్ గురించి గత కొంతకాలంగా ప్రచారంలో ఉన్న వార్తలకు తెరపడింది. మరో అభిమాని నటిగా కాకపోతే ఏ వృత్తిని ఎంచుకునేవారని ప్రశ్నించగా, చిన్నారుల మానసిక వైద్యురాలిగా మారాలని తనకు ఆసక్తి ఉండేదని శృతి తెలిపారు. ఆమె ఇచ్చిన ఈ సమాధానం కూడా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమైంది. తెలుగు, తమిళం, హిందీ చిత్రాల్లో వరుస విజ యాలతో గుర్తింపు తెచ్చుకున్న శృతి హాసన్ ప్రస్తుతం సినిమాల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. తక్కువ చిత్రాలు చేస్తున్నప్పటికీ అభిమా నులతో మాత్రం సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతరం మమే కమవుతున్నారు.



# నెటిజన్‌కు దర్శకుడు
# రాహుల్ స్పష్టీకరణ

**హైదరాబాద్, జూన్ 26**

దర్శకుడు రాహుల్ రవీంద్రన్‌కు సామాజిక మాధ్యమాల్లో ఓ నెటిజన్ చేసిన విజ్ఞప్తికి ఆయన విస్తృతంగా స్పందించారు. ఇటీవల పుణెలో వెలుగుచూసిన కేతన్ అగర్వాల్ హత్య ఘటనను ప్రస్తావిస్తూ, మహిళలు పురుషులపై చేసే నేరాల నేపథ్యంలో కూడా 'ది గర్ల్‌ఫ్రెండ్' తరహా సినిమా తీయాలని ఓ నెటిజన్ కోరగా, ఆ అంశంపై తన అభిప్రాయాన్ని రాహుల్ వివరించారు. రాహుల్ స్పందిస్తూ, సమాజంలోని నేరాలను తాను 'మహిళలు పురుషులపై చేసే నేరాలు' అనే కోణంలో చూడనని తెలిపారు. కొందరు వ్యక్తులు నేరాలకు పాల్పడతారని, అందులో మహిళలు కూడా ఉండొచ్చని పేర్కొన్నారు. అయితే శతాబ్దాలుగా మహిళలు ఎదుర్కొంటున్న వివక్ష, వారి జీవితాల్లోని నిశ్శబ్ద పోరాటాలే తన 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రానికి స్ఫూర్తిగా నిలిచాయని చెప్పారు. పుణె ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తాను ఇంకా చదవలేదని, చదివిన తర్వాత అందులో సినిమాకు తగిన కథాంశం కనిపిస్తే ఆ నిర్దిష్ట సంఘటన ఆధారంగా సినిమా తీయడాన్ని పరిశీలిస్తానని అన్నారు. అయితే కేవలం ఎవరో సూచించారని ఒక నిర్దిష్ట వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని సినిమా చేయబోనని స్పష్టం చేశారు. తన చిత్రాల శైలి గురించి వివరిస్తూ, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో ప్రధాన పాత్ర హంతకుడు కాదని, ఆ చిత్రంలో శారీరక హింస కంటే సంబంధాల్లోని సంక్లిష్టత, మానసిక వేధింపులపై ఎక్కువ దృష్టి పెట్టినట్లు చెప్పారు. మనుషుల మనస్తత్వం, సంబంధాల మధ్య జరిగే సంఘర్షణలే తన కథలకు ప్రధాన ఆధారమని వెల్లడించారు. ఇదిలా ఉండగా, రాహుల్ వ్యాఖ్యలపై ఆయన సతీమణి, గాయని చిన్మయి శ్రీపాద కూడా స్పందించారు. "రాహుల్ లాంటి వ్యక్తిని జీవిత భాగస్వామిగా పొందండి లేదా అలాంటి వ్యక్తి దొరికే వరకు పెళ్లి చేసుకోవద్దు. ఇదే నా సలహా. మిగతాది మీ నిర్ణయం" అంటూ ఆమె సామాజిక మాధ్యమాల్లో చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.



## హిట్ కోసం ఎదురుచూస్తున్న
# కేతిక శర్మ

**హైదరాబాద్, జూన్ 26**

టాలీవుడ్‌లో యువ నటి కేతిక శర్మ ఇప్పటికీ తన తొలి భారీ విజయాన్ని కోసం ఎదురుచూస్తున్నారు. రొమాంటిక్ సినిమాతో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆమె, మొదటి చిత్రంతోనే గ్లామర్ గర్ల్‌గా గుర్తింపు సంపాదించినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయారు. ఆకాష్ పూరి సరసన నటించిన తొలి సినిమా ప్రేక్షకుల్లో గుర్తింపు తీసుకువచ్చినప్పటికీ వసూళ్ల పరంగా పెద్ద విజయం సాధించలేదు. ఆ తర్వాత నాగశౌర్యతో నటించిన 'లక్ష్య' కూడా ఆమెకు నిరాశనే మిగిల్చింది. వైష్ణవ్ తేజ్‌తో చేసిన రంగ రంగ వైభవంగా' సినిమా కూడా డిజాస్టర్‌గా నిలవడంతో వరుసగా అవకాశాలు ఆశించినంతగా రాలేదు. పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో వచ్చిన 'బ్రో' చిత్రంపై ఆమె భారీ ఆశలు పెట్టుకున్నప్పటికీ, ఆ సినిమా కూడా కేతిక కెరీర్‌కు పెద్ద ఊతం ఇవ్వలేకపోయింది. దీంతో ప్రస్తుతం ఆమెకు పెద్దగా సినిమా అవకాశాలు తగ్గినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే సోషల్ మీడియాలో మాత్రం కేతిక శర్మ చాలా యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు. గ్లామరస్ ఫోటోలు, వీడియోలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ తన క్రేజ్‌ను నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. త్వరలోనే మంచి స్క్రిప్ట్‌తో మళ్లీ వెండితెరపై బలమైన కమ్‌బ్యాక్ ఇవ్వాలనే ఆశతో ఆమె ఎదురుచూస్తున్నారు.

This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467